# బీఆర్ఎస్‌పై విమర్శలు హాస్యాస్పదం



హుస్నాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకన్న, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు

- కర్ణాటకలో రైతులు ఛీకొడుతున్నా ఇక్కడికి వచ్చి అబద్ధపు ప్రచారం
- ప్రాజెక్టులపై అవగాహన లేకుండా పొన్నం ప్రభాకర్ మాట్లాడటం సరికాదు
- కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారం, అమలు కాని గ్యారెంటీలను ప్రజలు తిప్పి కొడతారు
- హుస్నాబాద్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలుసు
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

హుస్నాబాద్, అక్టోబర్ 26 : తమ పదవులు, టికెట్లపై ఎలాంటి గ్యారెంటీ లేని కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వం, పార్టీపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉన్నదని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. గురువారం సాయంత్రం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామ్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనీతిరుపతిరెడ్డి, ఎన్ఎల్‌సీఎఫ్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటకలో రైతులను, ప్రజలను మోసం చేసే హామీలు ఇచ్చి బొక్కాబోర్లా పడ్డ కాంగ్రెస్ తెలంగాణలో ప్రజలను మభ్యపెట్టేందుకు సిద్ధమవుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో రైతులకు ఉచిత కరెంటు ఇస్తామని, రూ.500లకే గ్యాస్ ఇస్తామని, ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాలుగున్నర నెలలు గడిచినా ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. కర్ణాటక రైతులకు కనీసం 5గంటల కరెంటు కూడా ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అక్కడి రైతులు ఛీకొడుతున్నారని, తెలంగాణలో ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చుతారని వారు ప్రశ్నించారు. ముందు అధికారంలో ఉన్న కర్ణాటకలో ఇచ్చిన హామీలను నెరవేర్చి తెలంగాణకు రావాలని హితవు పలికారు. కనీసం సీట్ల సర్దుబాటు చేసుకోలేని దుస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. ప్రాజెక్టులపై ఎలాంటి అవగాహన లేని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ బస్సు యాత్రలు పెట్టి కాళేశ్వరాన్ని సందర్శించేందుకు వెళ్లడం ఆయన దుందుడుకు చర్యలకు నిదర్శనమన్నారు. బ్యారేజీపై ఉన్న రోడ్డు కుంగితేనే మొత్తం ప్రాజెక్టు పాడైపోయినట్లు గ్లోబల్ ప్రచారం చేయడం కేవలం కాంగ్రెస్ వాళ్లకే చెల్లుతుందని విమర్శించారు. హుస్నాబాద్ నియోజకవర్గం అభ్యర్థిగా పార్టీ టికెట్ తెచ్చుకోలేని కాంగ్రెస్ నాయకులు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఏమిటో ఇక్కడి ప్రజలందరికీ తెలుసని, అభివృద్ధి ప్రదాతగా పేరుగాంచిన ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరనే ధీమా వ్యక్తం చేశారు. బోగస్ కార్డులను ఇంటింటికీ పంచుతూ తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొంకటి నళినీదేవి, బొజ్జ హరీశ్, గోవిందు రవి, పెరుక భాగ్యరెడ్డి, కోఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మార్కెట్ మాజీ చైర్మన్ తిరుపతి రెడ్డి, నాయకులు గందె చిరంజీవి పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

# కాంగ్రెస్ హయాంలో కష్టాలు, కన్నీళ్లు

- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
- జగదేవ్‌పూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

జగదేవ్‌పూర్, అక్టోబర్ 26 : కాంగ్రెస్ హయాంలో రైతులకు కష్టాలు, కన్నీళ్లు మాత్రమే మిగిల్చారని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ వంటేరు సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులతో కలసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. స్వరాష్ట్రంలో అన్నదాతల పాడిపంటలతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి

- మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి



మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ అగ్రహారంలో ప్రచారం నిర్వహిస్తున్న మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి

మనోహరాబాద్, అక్టోబర్ 26 : సీఎం కేసీఆర్‌తోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమని జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి అన్నారు. మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ అగ్రహారంలో గురువారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుంచి మూడోసారి పోటీ చేయడం మన అదృష్టమన్నారు. పల్లెగా ఉన్న వెంకటాపూర్ అగ్రహారాన్ని పంచాయతీగా మార్చి సుమారు రూ. కోటిన్నరతో అనేక అభివృద్ధి పనులను చేశారని ఇంటింటికీ తిరిగి వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, సీఎం కేసీఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేశ్ ముదిరాజ్, గ్రామాధ్యక్షుడు నీలగిరిగౌడ్, సర్పంచ్ రేణుకాఆంజనేయులు, సీనియర్ నేత అంబపురం వెంకటేశ్, ఆత్మకమిటీ డైరెక్టర్లు రాహుల్‌రెడ్డి, భిక్షపతి, ఉపసర్పంచ్‌లు ధర్మేందర్, రాజూయాదవ్, వార్డుసభ్యులు జ్ఞానగిరి యాదవ్, కిశోర్ యాదవ్, వెంకటేశ్‌యాదవ్, కో ఆప్షన్ సభ్యులు కుమార్‌గౌడ్, యాదమ్మ, నాయకులు పెంటాగౌడ్, నరేందర్‌గౌడ్, ఇర్ఫాన్, రమేశ్‌గౌడ్, నాగరాజు, రాజు, గణేశ్ పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ కిరణ్, పోలీసు సిబ్బంది

# హుస్నాబాద్‌లో వాహనాల తనిఖీ

**తనిఖీల్లో పట్టుబడ్డ రూ.1.62లక్షల నగదు**

హుస్నాబాద్, అక్టోబర్ 26 : పట్టణంలోని ప్రధాన రహదారుల్లో సీఐ ఎర్రల కిరణ్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు ప్రత్యేక బలగాలు గురువారం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన కూడళ్లు, రహదారుల వద్ద పికెటింగ్ ఏర్పాటు చేసి ద్విచక్రవాహనాలు, కార్లు తదితర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పట్టణంలోని అక్కన్నపేట రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం తనిఖీ చేయగా, రూ.1.62లక్షల నగదు పట్టుబడినట్లు సీఐ తెలిపారు. నగదను సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. రూ.50 వేలకు మించి డబ్బును తరలిస్తే వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు చూపించాలన్నారు. తనిఖీల్లో ఎస్సైలు తోట మహేశ్, వివేక్, హెచ్‌కానిస్టేబుల్ మొగిలి నాయక్, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

# కోహెడలో పోలీసుల కవాతు

- ప్రజలు స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలి
- ఏసీపీ వాసాల సతీశ్

కోహెడ, అక్టోబర్ 26 : కోహెడ మండల కేంద్రంలో గురువారం పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. దాదాపు 100 మంది పోలీసులు కవాతులో పాల్గొన్నారు. మం డల కేంద్రంలోని అన్ని వాడల్లో కవాతు నిర్వహించడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఏసీపీ వాసాల సతీశ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కిరణ్, ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.



కోహెడలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర, రాష్ట్ర బలగాలు

# నీటిలో పడి యువకుడు మృతి

మిరుదొడ్డి, అక్టోబర్ 26 : వ్యవసాయ పంపు వద్ద స్నానం చేస్తూ కాలు జారి నీటిలో పడి యువకుడు మృతిచెందిన సంఘటన మం డల కేంద్రమైన మిరుదొడ్డి టౌన్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. గురువారం మిరుదొడ్డి ఎస్సై వై.నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి టౌన్‌కు చెందిన కాస మంజుల, అంజయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. బుధవారం సాయంత్రం పొలం వద్ద కుటుంబ సభ్యులు అందరూ కలిసి మొక్కజొన్న కం కులు పట్టారు. మొక్కజొన్న కంకులు పట్టడంతో దుమ్ము, ధూళి శరీరంపై పడడంతో చిన్న కుమారుడు కాస కల్యాణ్ (25) బోరు బావి వద్దకు స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తున్న క్రమంలో కాలు జారి నీటిలో పడ్డాడు. దీంతో తలకు బలమైన దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న కాస నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని దుబ్బాక ఏరియా దవాఖానకు తరలించారు.

# మద్యం సీజ్

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 26 : ఇంట్లో మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో పోలీసులు దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. సీఐ కృష్ణారెడ్డి వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ చెందిన వంగ ఐలేశ్ ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం ఇంట్లో నిల్వ చేసి అమ్ముతున్నాడు. ఈ మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి ఐలేశ్ ఇంట్లో తనిఖీ చేయగా.. 56 లీటర్లు మద్యం దొరికింది. మద్యం విలువ సుమా రు రూ.35వేలు ఉంటుంది. పట్టుబడిన లిక్కరును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.